క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: మరమ్మత్తుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నానక్‌రాంగూడ విలేజ్, సుమధుర అపార్ట్‌మెంట్, ద శ్రీరామ స్కూల్, బౌల్డర్‌హిల్స్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వజ్రం అపార్ట్‌మెంట్స్, వైజయంతి అపార్ట్‌మెంట్, ఎస్ వీడియా, నానక్‌రాంగూడ, ప్రైమ్ అపార్ట్‌మెంట్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సరఫరాలో అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

అక్షయపాత్ర కిచెన్‌ను సందర్శించిన హెచ్‌సీయూ విద్యార్థులు



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలోని సంస్కృత అధ్యయనాల విభాగం విద్యార్థులు అక్షయపాత్ర 33వ కమ్యూనిటీ కిచెన్‌ను సందర్శించారు. ఈ మేరకు సోమవారం హెచ్‌సీయూ పీఆర్‌ఓ ఆశిష్‌జాకబ్‌థామస్ ఒక ప్రకటనలో తెలిపారు. అక్షయపాత్ర ఫౌండేషన్‌కు చెందిన 33వ వంటశాలను ప్రొఫెసర్ జేఎస్‌ఆర్ ప్రసాద్ నేతృత్వంలోని సంస్కృత అధ్యయనాల విభాగం ఎంఏ విద్యార్థులు, పరిశోధక విద్యార్థులు సందర్శించారు.

కట్ట మైసమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠలో బీజేపీ నేతలు

పటాన్‌చెరు టౌన్: అమీన్‌పూర్ మండల పరిధిలోని పటేల్‌గూడ గ్రామంలో నిర్వహిస్తున్న కట్ట మైసమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడీల శ్రీకాంత్ గౌడ్, జిల్లా కార్యదర్శి బైండ్ల కుమార్, నాయకులు సహదేవ్, చంద్రశేఖర్, సూజాత పాల్గొన్ని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని మెడ్వాన్ డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి అన్నారు. సోమవారం పటాన్‌చెరు మండలం కర్దనూర్, నందిగామ గ్రామాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పార్కర్ హనీ ఫిన్ ఇండియా సహకారంతో మెడ్వాన్ స్వచ్ఛంద సంస్థ విద్యార్థులకు క్రీడాసామగ్రి అందజేసింది.ఈ కార్యక్రమంలో సీడబ్ల్యూసీ మెంబర్ వెంకటేశం, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో ప్రమాదాలు నివారించాలి



వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పరిశ్రమల్లో ప్రమాదాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శాఖ అధికారులకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు కే.రాజయ్య మాట్లాడుతూ పరిశ్రమల యజమానులు నిర్లక్ష్యంగా ఉండడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు. నెల రోజుల వ్యవధిలోనే బొల్లారం, కాజిపల్లి బొంతపల్లి, పాశమైలారం ప్రాంతాలలో అనేక ప్రమాదాలు జరిగాయని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీధర్ రావు, వెంకటేష్, మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే



మాట్లాడుతున్న కాటా శ్రీనివాస్ గౌడ్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సోమవారం రామచంద్రాపురంలో కాంగ్రెస్‌లో చేరిన మైనార్టీలకు కండువా కప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మైనార్టీల అభివృద్ధికి కృషి చేశామన్నారు. కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకొచ్చిన ఆరు నెలల్లో 11శాతం రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇచ్చి మైనార్టీలను మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. హబీబ్, శ్రీరాములు, నాసిర్, వాజిద్, పీటర్, నవీన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి పనులతో దుర్వాసన..దుర్గంధం

- సుందరీకరణ పనులు ముందుకు సాగేనా..?
- మురుగు కుంపటిగా కాయిదమ్మకుంట చెరువు
- పైప్‌లైన్ జంక్షన్ వద్ద చాంబర్లు నిర్మించాలని ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



కాయిదమ్మకుంట చెరువు వద్ద పైప్‌లైన్‌కు చాంబర్ నిర్మించకపోవడంతో మురుగు నీరు చెరువులో కలుస్తున్న దృశ్యం

హఫీజ్‌పేట్ : చెరువులు, కుంటలను సుందరీకరణ పనులు ప్రత్యేక నిధులతో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో పనులు చేపడుతున్నారు. హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని పలు చెరువులు సుందరీకరణ దాదాపు పూర్తి కావచ్చినా మరి కొన్ని చెరువులను కనీసం పట్టించుకోవడం లేదు. కాయిదమ్మకుంట చెరువు చుట్టు పక్కల ఉన్న కాలనీలు, పెద్ద పెద్ద భవనాలు ఉన్నాయి. కానీ వారికి అందుబాటులో ఉన్న చెరువు మాత్రం అభివృద్ధికి నోచుకోవడం లేదు. చెరువులో మురుగు నీరు కలవకుండా ప్రత్యేకంగా మీదికుంట చెరువు నుంచి కాయిదమ్మకుంట చెరువు చుట్టు పైప్ లైన్ వేసినప్పటికీ చాంబర్లు నిర్మించలేదు. వినాయక చవితి, బతుకమ్మ పండుగలు వస్తే చెరువు కట్ట వద్ద హడావుడి చేసి చెరువులోని గుర్రపు డెక్కతో పాటు చెత్తను తొలగిస్తారు. పండుగల తరువాత చెరువును పరిశీలించే అధికారి మాత్రం ఉండరు. ఇప్పటికైనా చెరువు సుందరీకరణ పనులు త్వరతగతిన పూర్తి చేయాలని స్థానికుల ప్రజలు కోరుతున్నారు.

సమస్యలు ఇవే....

- కాయిదమ్మకుంట చెరువు చుట్టు పైప్‌లైన్ వేసినా చాంబర్లు నిర్మించలేదు. దాని వల్ల గేటెడ్ కమ్యూనిటి వాసులకు దుర్వాసన, దుర్గంధం సతమతమవుతున్నారు.
- గుర్రపు డెక్క తొలగించినప్పటికీ తిరిగి మరలా పెరిగింది.
- చుట్టు పక్కల కాలనీలు భారీగా పెరగడంతో వాటి నుంచి మురుగు నీరు చెరువులోకి వదిలేస్తున్నారు.
- కుంట పక్కనే స్క్రాప్ దుకాణం వల్ల కూడా చెరువంతా దుర్గంధంగా మారుతుంది.
- చుట్టు పక్కల కాలనీలకు దోమల వల్ల చిన్నపిల్లలకు విష జ్వరాలు వెదజల్లుతున్నాయి.
- చెరువు కట్టపై ఇష్టానుసారం చెత్త చెదారం, వాహనాల పార్కింగ్ చేయడం వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.
- తూతూ మత్రంగా చెరువు చుట్టు ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు కానీ అనంతరం దానిని పట్టించుకోవడం లేదు.

చెరువు వద్ద చేపట్టాల్సిన పనులు

- చెరువులోకి మురుగు నీరు చేరకుండా ప్రత్యేక పైప్ లైన్ వాసిన వాటికి వెంటనే చాంబర్లు నిర్మించాలి.
- చెరువులో ఎంటమాలజీ సిబ్బందితో దోమల నివారణ పిచకారి చేయించాలి.
- కాయిదమ్మ కుంట చెరువు సుందరీకరణ పనుల్లో వేగం పెంచి త్వరతగతిన పూర్తి చేయాలి
- వాకింగ్ ట్రాక్ పనులు త్వరతగతిన పూర్తి చేయాలి
- ఇరిగేషన్ అధికారులు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌సూచిక బోర్డు పెట్టాలి
- కట్టపై వాహనాలు పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలి
- చెరువులో ఉన్న చెత్త చెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడానికి చర్యలు తీసుకోవాలి
- ప్రతి రోజు చెరువు సంరక్షణ కోసం సిబ్బందిని నియమించాలి
- చెరువులో భవన నిర్మాణాల వ్యర్థాలు వేయకుండా చూడాలి



పైప్‌లైన్ల వద్ద చాంబర్ నిర్మించుకుండా వదిలేసిన దృశ్యం



చెరువులో పెరుగుతున్న గుర్రెపు డెక్క

పైప్‌లైన్ జంక్షన్ వద్ద చాంబర్లు నిర్మించాలి



కాయిదమ్మకుంట చెరువు చుట్టు మురుగునీరు కలవకుండా పైప్‌లైన్ నిర్మించారు, కానీ చాంబర్లు నిర్మించలేదు. దీంతో దుర్వాసన, దుర్గంధం వల్ల తామంతా సతమతం అవుతున్నాం. కుంట పూర్తిగా మురుగు కుంపటిగా మారింది. చెరువులో చెత్త వేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. చెరువు సుందరీకరణ త్వరతగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి.

– జంగం గౌడ్, జనప్రియనగర్

త్వరలోనే పైప్‌లైన్ పనులు పూర్తి చేస్తాం



మీదికుంట చెరువు నుంచి కాయిదమ్మకుంట వరకు చెరువులో మురుగు నీరు కలవకుండా ప్రత్యేక పైప్‌లైన్ నిర్మించాం. కానీ రెండు పైప్‌లైన్లు కలిసే వద్ద చాంబర్లు నిర్మించాలి. త్వరలోనే ఆ చాంబర్లు నిర్మిస్తాం. అంతే కాకుండా సుందరీకరణ పనులు కూడా పూర్తి చేస్తాం.

– శేషగిరిరావు, ఇరిగేషన్ డీఈ


అంతర్జాతీయ ఫెస్ట్‌లకు మూడు 'మనూ' సినిమాలు ఎంపిక



గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయం పరిపాలనాభవనం

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో రూపొందించిన మూడు చిత్రాలు అంతర్జాతీయ ఫెస్ట్‌లకు ఎంపికయ్యాయి. ఉర్దూ యూనివర్శిటీలోని ఇన్‌స్ట్రక్షనల్ మీడియా సెంటర్(ఐఎంసీ) ఆధ్వర్యంలో నిర్మించిన మూడు చిత్రాలు ఎంపిక కావడం విశేషం. ఈ మూడు చిత్రాలు రెండు ప్రతిష్టాత్మక చలనచిత్రోత్సవాలకు ఎంపికయ్యాయి. ఈ సందర్భంగా ఐఎంసీ డైరెక్టర్ రిజ్వాన్ అహ్మద్ ఈ చిత్రాల ఎంపికపై ఆయన సోమవారం వివరించారు.పైన్‌వుడ్ ఫిల్మ్ స్టూడియో, ఐవర్, బకింగ్‌హామ్‌షైర్, మరో రెండు డాక్యుమెంటరీ చిత్రాలు 'ఎనర్జీ ఫ్రమ్ వేస్ట్, 'చే లిఫ్ట్–ఆఫ్ గ్లోబల్ నెట్‌వర్క్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ కోసం షార్ట్ ఫిల్మ్ 'అరిస్టాటిల్' ఎంపికయ్యాయన్నారు. కన్సార్టియం ఫర్ ఎడ్యుకేషనల్ కమ్యూనికేషన్(సీఈసీ,యూజీసీ) మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ ద్వారా 14వ ప్రకీర్తి ఇంటర్నేషనల్ డాక్యుమెంటరీ ఫిల్మ్ ఫెస్టివల్‌లో స్క్రీనింగ్ కోసం ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియాకు ఎంపికైందన్నారు.

'జల్‌శక్తి' అవార్డు రేసులో 'ఉర్దూ విశ్వవిద్యాలయం'



'మనూ'లో పర్యటిస్తున్న కేంద్ర బృందంతో మనూ సభ్యులు

రాయదుర్గం: కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వశాఖ ఉన్నత స్థాయి బృందం గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం క్యాంపస్‌ను సందర్శించింది. ఉర్దూ విశ్వవిద్యాలయంలో క్యాంపస్‌లో వినియోగానికి ఉత్తమ సంస్థ కింద 4వ జాతీయ నీటి అవార్డుల కోసం ఉర్దూ విశ్వవిద్యాలయం దరఖాస్తు చేసుకుంది. ఈ నేపథ్యంలో గ్రౌండ్ ట్రూతింగ్ కోసం సందర్శిం చింది. ఉర్దూ విశ్వ విద్యా లయం ఈ ప్రతిష్టాత్మక అవార్డు కోసం దరఖాస్తు చేసింది. కేజీబీఓ సీడబ్ల్యూసి హైదరాబాద్‌లోని చీఫ్ ఇంజనీర్ డి రంగారెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీనివాసుబైరి ఆధ్వర్యంలోని బృందంలో సైంటిస్ట్ కరోలినాలూయిస్, సీడబ్ల్యూసీ పీఏ ఎంవికేసురేష్‌లతో కూడిన బృందం క్యాంపస్‌లో పర్యటించింది. ఈ సందర్భంగా వారు క్యాంపస్‌లోని నీటి వనరులు నీటి కొలనులు, వాటర్ హార్వెస్టింగ్‌పిట్స్, బోరువావుల వినియోగం వంటి వాటిని వారు పరిశీలించారు. కేంద్ర బృందానికి మనూ జల్‌శక్తి అభియాన్ చైర్మన్ ప్రొఫెసర్ షకీల్ అహ్మద్‌స్వాగతం పలికారు.

బీఆర్‌ఎస్‌పార్టీ ఆగడాలకు అడ్డుకట్ట వేయాలి



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్

శేరిలింగంపల్లి: తెలంగాణ రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌పార్టీ ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్ పేర్కొన్నారు. లింగంపల్లి, తారానగర్‌లో శక్తి కేంద్రాల కార్నర్ మీటింగ్‌లలో భాగంగా లింగంపల్లి రైల్వేస్టేషన్ ఎదురుగా ఈ సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్ర నాయకులు రాంరెడ్డితోకలిసి ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సాధన కోసం 1200 మంది త్యాగాలను ఎంతో మంది ఉద్యమ కారులను తెలంగాణ సెంటిమెంట్‌ను వాడుకొని లక్షల కోట్ల రూపాయలను దోచుకొని ఇప్పుడు దేశాన్ని దోచుకోవడానికి బిఆర్‌ఎస్‌పార్టీగా టీఆర్‌ఎస్‌ను మార్చారన్నారు. బీఆర్‌ఎస్‌పార్టీ, సీఎం కేసీఆర్ మోసాలను మాయమాటలను ప్రజలకు అర్థమయ్యేలా చెప్పడానికి బీజేపీ ప్రజా గోస, బీజేపీ భరోసా కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మహిపాల్‌రెడ్డి, రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

ఆర్టీసీ కానిస్టేబుళ్లకు ఓరియెంటేషన్ ట్రైనింగ్



శిక్షణను ప్రారంభిస్తున్న ఆర్టీసీ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ జాయింట్ డైరెక్టర్ సంగ్రం సంఘజీ పటేల్

గచ్చిబౌలి: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీఎస్‌ఆర్‌టీసీ)లోని కానిస్టేబుళ్లకు ఓరియెంటేషన్ ట్రైనింగ్‌ను ఆర్టీసీ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ జాయింట్ డైరెక్టర్ సంగ్రం సంఘజీ పటేల్ ప్రారంభించారు. కొండాపూర్‌లోని టీఎస్‌ఎస్‌పీ 8వ బెటాలియన్‌లో 166 మంది ఆర్టీసీ కానిస్టేబుళ్లకు ఓరియెంటేషన్ ట్రైనింగ్‌ను బెటాలియన్ కమాండెంట్ మురళి కృష్ణతో కలిసి ఆయన ప్రాంభించారు. ఇందులో 106 మంది పురుషులు, 59 మంది మహిళ కానిస్టేబుళ్లు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ కృష్ణకాంత్, హైదరాబాద్ జోన్ విజిలెన్స్ సెక్యూరిటీ రామమూర్తి, ట్రైనింగ్ హెడ్ ఎస్.వి.రమణ, యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జ్యోతిభాపులే, కోఆర్డినేటర్, అసిస్టెంట్ కమాండెంట్ డి.నారాయణ దాసు తదితరులు పాల్గొన్నారు.

టీ హబ్-సుజుకి ఇన్నోవేషన్ సెంటర్ మధ్య ఒప్పందం



ఒప్పందం కుదుర్చుకున్న సందర్భంగా రెండు సంస్థల ప్రతినిధులు

రాయదుర్గం: టీహబ్–సుజుకి మోటార్ కార్పొరేషన్ (ఎస్‌ఎంసీ)తో ఒప్పందం కుదుర్చుకుంది. సోమవారం హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్ ప్రాంగణంలో జపాన్ మాజీ అంబాసిడర్ హిడెకి డొమిచి సమక్షంలో సుజుకి మోటార్ కార్పొరేషన్ డైరెక్టర్, సీనియర్ మేనేజింగ్ ఆఫీసర్ కింజిసైటో, ఎగ్జిక్యూషన్ హెడ్ విపుల్ జిందాల్, టీహబ్ సీఈఓ శ్రీనివాస్‌రావు మహంకాళి, కార్పొరేట్ ఇన్నోవేషన్ హెడ్ ప్రత్యూష కోనేటి సంతకాలు చేశారు. అనంతరం ఒప్పంద పత్రాలను రెండు సంస్థల ప్రతినిధులు మార్చుకున్నారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన కార్పొరేటర్



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ రైల్ విహార్ కాలనీలో కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ సోమవారం పర్యటించారు. కాలనీలో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో స్ట్రామ్ వాటర్ డ్రైన్స్‌పై కప్పులను, ఫుట్ పాత్‌ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని హామి ఇచ్చారు. వెంటనే సదరు అధికారులతో మాట్లాడి ఆయా పనులను పూర్తి చేయాలని కోరారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకరావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, ప్రతినిధులు గుత్త స్వామి, బాబురావు, కామేశ్వర్‌రావు అజిత్ రెడ్డి, శివ, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం నిర్దేశించుకొని చదవాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ భూపాల్ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): విద్యార్థులు లక్ష్యం నిర్దేశించుకొని ఇష్టపడి చదివాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. సోమవారం రామచంద్రాపురం పట్టణంలోని శ్రీగీతా భూపాల్ రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవ వేడుకలకు రాష్ట్ర శాసన మండలి మాజీ ప్రొటెం చైర్మన్ వెన్నవరం రెడ్డితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు అప్పటి సీఎం వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి సహకారంతో జూనియర్ కళాశాలను మంజూరు చేయించుకున్నారని అన్నారు. సొంత నిధులతో, స్నేహితుల సాకారంతో ప్రభుత్వ కళాశాల భవనాన్ని కార్పొరేట్ కళాశాల భవనానికి దీటుగా నిర్మించినట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ వెన్నవరం భూపాల్ రెడ్డి మాట్లాడుతూ అధ్యాపకులు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని వాటిని ఆచరణలో పెడితే బంగారు భవిష్యత్తు ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ భూపాల్ రెడ్డి సతీమణి వెన్నవరం గీత, స్థానిక కార్పొరేటర్లు బూరుగడ్డ పుష్ప, వెన్నవరం సింధు, మాజీ కార్పొరేటర్ అంజయ్య యాదవ్, జిల్లా గ్రంథాలయ డైరెక్టర్ కుమార్ గౌడ్, సీనియర్ నాయకులు వెన్నవరం మోహన్ రెడ్డి, ఆదర్శ్ రెడ్డి, ఐలేష్ యాదవ్, గోవింద్, పరమేష్ యాదవ్, సోను గౌడ్, ప్రమోద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల నిందితుడు అరెస్ట్

- రూ.9 లక్షల విలువ గల 16 వానాలు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలు

చందానగర్: ద్విచక్ర వాహనాలను దొంతనం చేసిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. ఈ వివరాలను డీసీపీ శిల్పవల్లి విలేకరులకు వివరించారు. జగిత్యాల జిల్లా రాజక్కపల్లికి చెందిన రంగు గంగాధర్(27) 2019లో నగరానికి వచ్చి ఐడియా బొల్లారంలోని బీరప్ప బస్తీలో ఉంటూ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. చెడు అలవాట్లకు, జల్సాలకు, మద్యానికి అలవాటు పడి ఉద్యోగం చేయగా వచ్చిన డబ్బులు సరిపోకపోవడంతో 2022 నుండి పార్కింగ్ ప్రదేశాలలో ద్విచక్రవాహనాలను దొంగతనం చేసి ఓఎల్‌ఎక్స్‌లో అమ్మగా వచ్చిన డబ్బును జల్సాలు చేస్తున్నాడు. మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 5, సనత్‌నగర్‌లో 3, మాదాపూర్‌లో ఒకటి, కూకట్‌పల్లిలో 2, కేపీహెచ్‌బీ 1, ఉప్పల్‌లో 3, ఎల్బీనగర్‌లో 1 మొత్తం 16 వాహనాలను దొంగతనం చేసినట్టు తెలిపారు. ఎక్కువగా మెట్రో స్టేషన్‌లు వద్ద, పార్కింగ్ ప్రదేశాలలో వాహనాలను టార్గెట్ చేసి దొంగిలించినట్టు తెలిపారు. మియాపూర్ పోలీసులు మియాపూర్ మెట్రోస్టేషన్ వద్ద తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన గంగాధర్‌ను విచారించగా వివరాలను తెలిపారు. అతని వద్ద నుండి 9 లక్షలు విలువైన 16 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ నర్సింహారెడ్డి, మియాపూర్ ఏసీపీ నర్సింహారావు, ఏసీపీ శశాంక్‌రెడ్డి, సీఐలు తిరుపతి రావు, సీఐ ప్రసన్నకుమార్, మియాపూర్ డిఐ కంతారెడ్డి, ఎస్సైలు యాదగిరిరావు, గోపరాజు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

టాన్‌చెరు టౌన్: పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికుల వేతనాలు చెల్లించాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం మండల అభివృద్ధి అధికారి బన్సీలాల్ కు వినతి పత్రం అందజేశారు. కార్మికులు షబ్బీర్, వేణు, రాములు, జంగయ్య తదితర కార్మికులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు సంపూర్ణ సహకారం

పటాన్‌చెరు: క్రీడలు, క్రీడాకారుల అభివృద్ధికి ఎల్లప్పుడూ సహకరిస్తానని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఈ నెల 16నుంచి 19వరకు హర్యానాలోని కురుక్షేత్రంలో జరగనున్న జాతీయస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్ పోటీలకు హాజరవుతున్న తెలంగాణ జట్టుకు ఎమ్మెల్యే రూ.3లక్షల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..20 సంవత్సరాలుగా మాస్టర్ అథ్లెటిక్స్ జట్టుకు సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తున్నానన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో సంగారెడ్డి జిల్లా జట్టుతో పాటు రాష్ట్ర జట్లు మంచి ప్రతిభ కనబరుస్తున్నాయన్నారు.